ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

సిద్దిపేట 3

శుక్రవారం 16 ఫిబ్రవరి 2024





సరస్వతీ స్తోత్రంపై బాలికల నాట్య ప్రదర్శన

ముగిసిన సరస్వతీ క్షేత్ర వార్షిక బ్రహ్మోత్సవాలు

చిన్నకోడూరు, ఫిబ్రవరి 15: చిన్నకోడూరు మండలం అనంతసాగర్ గ్రామశివారులోని సరస్వతీ క్షేత్రంలో వసంతపంచమిని పురస్కరించుకుని మూడురోజుల పాటు నిర్వహించిన 34వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పలు అకాడమీల ఆధ్వర్యంలో నాట్యప్రదర్శన నిర్వహించారు. డివోనషల్ స్పిర్చువల్ బుక్‌ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం కోసం కీ.శే. అష్టకాల నరసింహరామశర్మ రచించిన సరస్వతీ స్తోత్రంపై 108 మంది బాలికలు 9 గంటల 33 నిమిషాల పాటు నాట్యం చేశారు. ఈ వేదికగా ఫ్యూచర్ స్టార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో సిద్దిపేటకు చెందిన శ్రేయకు చోటుదక్కింది. కార్యక్రమంలో ఆంధ్రా మహాసభ అధ్యక్షుడు డాక్టర్ రాధామోహన్, సంస్థ కోఆర్డినేటర్ డాక్టర్ కేవీ రమణారావు, చారిటబుల్ ట్రస్ట్, కల్చరల్ అకాడమి సభ్యులు, నాట్యగురువులు పాల్గొన్నారు.

పాడిరైతుల సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పిన ఎమ్మెల్యే పల్లా



చేర్యాల, ఫిబ్రవరి 15: అసెంబ్లీ సమావేశాల్లో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్థానిక సమస్యలపై గళం విప్పారు. కొంతకాలంగా జనగామ నియోజకవర్గ పరిధిలోని చేర్యాల పాలశీతలీకరణ కేంద్రంలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాల్లో పాడిరైతుల సమస్యలను ఆయన ప్రస్తావించారు. రాష్ట్రవ్యాప్తంగా పాల ఉత్పత్తిదారులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇక జనగామ నియోజకవర్గంలో అధిక శాతం చిరు వ్యవసాయదారులు పాల ఉత్పత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. స్థానికంగా నాణ్యతను సరిగా పరిశీలించకపోవం వల్ల హైదరాబాద్‌కు పంపించిన తర్వాత పాలను తిరస్కరించి వెనక్కు పంపుతున్నారని చెప్పారు. ఫలితంగా పాడిరైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. రెండు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాడిరైతులకు ప్రోత్సాహకంగా అందించే రూ.4బోనస్‌ను ఇప్పుడు చెల్లించడం లేదని దీంతో రైతులకు గిట్టుబాటు కావడం లేదని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఆలోచించి ఇతర పద్దులను కాస్త నిలిపైనా రైతాంగానికి మేలు చేసేందుకు బోనస్ ధరను, రెండు నెలల బకాయితో పాటు పాలు తిరస్కరణకు గురవ్వకుండా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

మల్లన్న ఆలయ మోడల్‌లోనే కొమురవెల్లి రైల్వే హాల్ట్‌స్టేషన్

- ప్రధాని నరేంద్రమోదీ కృషితో సాకారం
- ఆధునిక హంగులతో వసతుల కల్పన
- రవాణాసౌకర్యం మెరుగుదలతో సామాజిక, ఆర్థికాభివృద్ధి
- మల్లన్నరైల్వే హాల్ట్‌స్టేషన్ భూమిపూజ కార్యక్రమంలో కేంద్ర పర్యాటక,సాంస్కృతికశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి
- హాజరైన మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్

చేర్యాల, ఫిబ్రవరి 15 : కోట్లాది మంది భక్తుల ఇలవేల్పుగా, తెలంగాణ, జానపద సంస్కృతికి ప్రతిబింబంగా విలసిల్లుతున్న మల్లన్న ఆలయ శోభ, సంప్రదాయం ఉట్టిపడేలా కొమురవెల్లి రైల్వే హాల్ట్‌స్టేషన్‌ను అత్యద్భుతంగా నిర్మించేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య ప్రాంత అభివృద్ధిశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. కొమురవెల్లి గ్రామశివారులోని రైల్వేగేట్ సమీపంలో చేపట్టనున్న రైల్వే హాల్ట్‌స్టేషన్ నిర్మాణానికి గురువారం ఆయన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడారు. కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్ ప్రారంభించిన ప్రధాని నరేంద్రమోదీ చొరవతోనే కొమురవెల్లిలో రైల్వే హాల్ట్‌స్టేషన్ సాకారమైందని తెలిపారు. రైల్వే హాల్ట్‌స్టేషన్‌ను మల్లన్న ఆలయ మోడల్‌లో తీర్చిదిద్దడంతో పాటు ప్రయాణికులకు సౌకర్యంగా ప్లాట్‌ఫాం, బుకింగ్ కౌంటర్, వెయింటిగ్ హాల్, ఉచిత వైఫై సౌకర్యంతో త్వరితగతిన అందుబాటులోకి తీసుకురానున్నామని పేర్కొన్నారు. కొత్తపల్లి- మనోహరాబాద్ రైల్వేలైన్ నిర్మాణంతో రైతుల ఉత్పత్తులను సరఫరా చేయనున్నామని ఆయన స్పష్టం చేశారు.



రైల్వేస్టేషన్ నేమ్‌బోర్డు వద్ద రైల్వే జీఎం అరుణ్ కుమార్‌జైన్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్, లక్ష్మణ్



సభలో ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ఇంటికి తిరిగి వచ్చినట్లుంది : మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్

కొమురవెల్లి మల్లన్న చెంత నిర్మాణం కాబోతున్న రైల్వే హాల్ట్‌స్టేషన్ భూమి పూజలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానని, తాను తన ఇంటికి తిరిగి వచ్చిన అనుభూతి పొందుతున్నానని మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్ అన్నారు. మల్లన్న స్టేషన్ ద్వారా ప్రతి ఒక్కరికీ ప్రయోజనం చేకూరుతుందన్నారు. సభలో పలుమార్లు మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రసంగంతో పాటు సభపైకి ఆహ్వానిస్తున్న సమయంలో మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు పేరు ప్రస్తావించడంతో అభిమానులు ఈలలు, కేకలతో అభిమానం చాటుకున్నారు.

మల్లన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు

మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ కొమురవెల్లి మల్లన్న ఆలయాన్ని సందర్శించారు. ముఖమండపంలో పట్నం వేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అర్చకులు, ఒగ్గు పూజారులు స్వామి వారి ప్రసాదం, బండారి అందించి ఆశీర్వదించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో బాలాజీశర్మ, పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి తదితరులు ఒగ్గుపూజారుల జగ్గుమోతల నడుమ ఆలయార్చకులతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మల్లన్న ఆలయాభివృద్ధి, భక్తుల వసతుల కల్పన దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.100కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, ఈవో బాలాజీ శర్మ మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. అయితే మల్లన్న రైల్వేహాల్ట్‌స్టేషన్ అంశం బీజేపీకి అందివచ్చే విషయమైనప్పటికీ నేతల మధ్య సమన్వయం, ప్రచార లోపంతో ఊహించిన మేర కార్యకర్తలు ఆశించిన మేర రాలేదు. షెడ్యూల్ ప్రకారం గురువారం సాయంత్రం 4గంటలకు కార్యక్రమం ప్రారంభించాల్సి ఉండగా ఆలస్యంగా మొదలైంది. ఇక మంత్రి కిషన్‌రెడ్డి హాల్ట్‌స్టేషన్ మినహా ఆలయాభివృద్ధిని ప్రస్తావించకపోవడంతో స్థానికులు తీవ్ర నైరాశ్యానికి లోనయ్యారు. ఆయా కార్యక్రమాల్లో రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్, మాజీ ఎంపీ బూర నర్సయ్య, మాజీ ఎమ్మెల్యే రఘు నందన్‌రావు, దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్, డీఆర్‌ఎం లోకేశ్ వైష్ణవ్, సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కొమురవెల్లి జడ్పీటీసీ సిద్దప్ప, బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డితో పాటు సిద్దిపేట జిల్లా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మల్లన్నకు పట్నం వేసి మొక్కులు తీర్చుకుంటున్న, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, సీఎం మోహన్‌యాదవ్ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్



రైల్వేస్టేషన్ భూమిపూజలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్, జడ్పీచైర్‌పర్సన్ రోజాశర్మ

రహదారులు రక్తమోడుతున్నయ్

- జిల్లాలో రోజురోజుకు అధికమవుతున్న రోడ్డు ప్రమాదాలు
- 2023 జనవరి నుంచి ఇప్పటి వరకు 580 ప్రమాదాలు
- 296 మంది మృతి.. అతివేగమే ప్రధాన కారణం?

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 15 : సిద్దిపేట జిల్లావ్యాప్తంగా గతేడాది నుంచి జనవరి నుంచి ఫిబ్రవరి 13 వరకు 580 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఆయా ప్రమాదాల్లో 296 మంది చనిపోయారు. దాదాపు 500 మంది వరకు తీవ్రంగా గాయపడ్డారు. అయితే, ఈ ప్రమాదాల బారిన వారిలో ద్విచక్రవాహనదారులే అధికం. ఇక మృతుల్లో 30 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్కుల వారే ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు.

యూటర్న్‌ల వద్దనే ఎక్కువ

జిల్లాలో ములుగు నుంచి బెజ్జంకి క్రాస్‌రోడ్డు వరకు రాజీవ్ రహదారి 98 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఈ రాజీవ్ రహదారిపై వేగంగా వెళ్తున్న క్రమంలో యూటర్న్‌ల వద్ద అధిక ప్రమాదాలు జరుగుతున్నాయి. గంటకు 80 కిలోమీటర్ల కన్నా ఎక్కువ వేగంతో వెళ్లే వాహనాలకు స్పీడ్ లేజర్ గన్ ద్వారా పోలీసులు భారీగా జరిమానా విధిస్తున్నారు. రాత్రివేళ్లలో స్పీడ్ లేజర్ గన్‌లు లేకపోవడంతో వాహనదారులు అతి వేగంగా వెళ్లడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దూరప్రాంతాలకు వెళ్లే లారీ డ్రైవర్లు రాత్రివేళల్లో సేదతీరేందుకు రోడ్డు పక్కన నిలుపుతుండడం వల్ల అవి కనపడక యాక్సిడెంట్లు అవుతున్నాయి. అలాగే రహదారి పక్కన ఉన్న గ్రామాల్లో యూటర్న్ దూరంగా ఉండడం వల్ల ఆయా గ్రామాల ప్రజలు రాంగ్‌రూట్‌లో వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు.



రాజీవ్ రహదారిపై ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆటో (ఫైల్)

> సిద్దిపేట జిల్లాలోని రహదారులు రక్తమోడుతున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నా... రహదారులు రక్తసిక్తమవుతూనే ఉన్నాయి. అతివేగం, నిర్లక్ష్యం వల్ల అనేక ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. దూరప్రాంతాలకు వాహనాలపై వెళ్లిన వారు క్షేమంగా ఇంటికి చేరే వరకు కుటుంబికులకు ఆందోళనకు తప్పడం లేదు. ప్రమాదానికి గురై కుటుంబ పెద్దదిక్కు ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబానికి తీరని శోకం మిగులుతున్నది.

రాజీవ్ రహదారిపై 15 బ్లాక్‌స్పాట్స్

రాజీవ్ రహదారిపై ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించాలని పోలీస్ ఉన్నతాధికారులు పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు జిల్లా పరిధిలో ఉన్న 98 కిలోమీటర్ల రాజీవ్ రహదారిపై 15 బ్లాక్‌స్పాట్స్ గుర్తించారు. ఈ బ్లాక్‌స్పాట్స్ వద్ద వాహనాల వేగం తగ్గించే విధంగా చర్యలు చేపట్టారు.

అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గతనెల రాష్ట్ర డీజీపీ రవిగుప్తా అన్ని జిల్లాల ఎస్పీలు, సీపీలతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి రోడ్డు ప్రమాదాల నివారణపై సమీక్షించారు. వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలన్నారు. రహదారులపై వేగంగా వెళ్లే వాహనాలకు స్పీడ్ లేజర్ గన్ ద్వారా ఫైన్‌లు వేయాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే ప్రమాదాల నివారణకు యేటా రోడ్డు భద్రతా వారోత్సవాలను ఆర్టీవో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఈ క్రమంలో జిల్లాలో జనవరి 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు నెలరోజుల పాటు వాహనదారులకు రోడ్డు భద్రత, నియమాలపై అన్ని పట్టణాల్లో బస్టాండ్‌లు, చౌరస్తాల వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ద్విచక్రవాహనాలు నడిపే సమయంలో హెల్మెట్, కారు నడిపే సమయాల్లో సీటు బెల్టు ధరించాలని తెలియజేస్తున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటున్నారు. డ్రంకెన్ అండ్ డ్రైవ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల జరిగే ప్రమాదాలపై ప్రొజెక్టర్ ద్వారా వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు.

జిల్లాలో గుర్తించిన బ్లాక్‌స్పాట్స్
రాజీవ్ రహదారిపై బెజ్జంకి ఎక్స్‌రోడ్డు,
ఇబ్రహీంనగర్ గ్రామ చౌరస్తా
శనిగరం ఎక్స్‌రోడ్డు
మందపల్లి చౌరస్తా
రామునిపట్ల చౌరస్తా
రంగధాంపల్లి చౌరస్తా
పొన్నాల ఎక్స్ రోడ్డు
ఓల్డ్ బస్టాండ్ సర్కిల్
దుద్దెడ ఎక్స్ రోడ్డు
తిమ్మారెడ్డిపల్లి
రిమ్మనగూడ
ప్రజ్ఞాపూర్ క్రాస్‌రోడ్డు
వంటిమామిడి చౌరస్తా
నాచారం గ్రామ చౌరస్తా,
భూంపల్లి ఎక్స్ రోడ్డు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మహిళ (ఫైల్)



సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా పూజలు చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఇందిరా గాంధీ వల్లే గిరిజనుల జీవితాల్లో వెలుగులు

- సంత్‌సేవాలాల్ జయంతి వేడుకల్లో రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, ఫిబ్రవరి 15 : మాజీ ప్రధాని, దివంగత ఇందిరా గాంధీ ప్రవేశపెట్టిన రిజర్వేషన్ల వల్లనే గిరిజనుల స్థితిగతులు మారాయని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం హుస్నాబాద్‌లోని బంజారాభవన్‌లో జరిగిన సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గిరిజనులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనులు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదిగేందుకు రిజర్వేషన్లు ఉపయోగపడ్డాయని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గ గిరిజనుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గిరిజన రిజర్వేషన్ల నియోజకవర్గాల కంటే హుస్నాబాద్‌లో వారి సంక్షేమానికి ప్రాధాన్యత వచ్చేలా చూస్తానని వెల్లడించారు. కుర్చీ వేసుకొని పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన మాజీ సీఎం కేసీఆర్ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. గౌరవెల్లి రిజర్వాయర్ పూర్తయ్యిందని చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. నీళ్ల కోసం అసెంబ్లీలో చర్చిస్తే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఎదురుదాడికి దిగుతున్నారని, వారు భయపెడితే భయపడేది లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, ఎంపీపీలు మానస, లక్ష్మీ, జడ్పీటీసీ భూక్య మంగ, ప్రొఫెసర్ వీరన్ననాయక్, మాజీ జడ్పీటీసీ బీలునాయక్, గిరిజన సంఘాల నాయకులు వీరన్ననాయక్, కిషన్‌నాయక్, భీమాసాహేబ్, బిక్షపతినాయక్, రమేశ్‌నాయక్, తిరుపతినాయక్, భాస్కర్‌నాయక్, సంపత్‌నాయక్, సోమ్లునాయక్, రాజునాయక్, బీక్యానాయక్, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, సది, సరోజన పాల్గొన్నారు.



గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న మంత్రి

దగా పడ్డ మహిళలకు అండగా భరోసా కేంద్రాలు

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 15 : సమాజంలో దగా పడ్డ మహిళలకు అండగా నిలవడానికి ప్రభుత్వం భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నదని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. మెదక్ పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో రూ.2 కోట్లతో నూతనంగా నిర్మించిన భరోసా కేంద్రం నూతన భవనాన్ని, పీటీం కార్యాలయాన్ని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుతో కలిసి గురువారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ అత్యాచారాలు, చిత్రహింసలకు గురైన మహిళలు, చిన్నారులకు సహాయం చేసేందుకు భరోసా కేంద్రాలు అండగా నిలుస్తున్నామని తెలిపారు. మానసిక వేధింపులకు గురికాకుండా స్వాంతన చేకూర్చే విధంగా పనిచేస్తాయన్నారు. 2022 ఆగస్టు నుంచి ఇప్పటివరకు 135 కేసులు నమోదయ్యాయని, వారికి రూ.27 లక్షలకుపైగా ఆర్థిక సహాయం అందజేసినట్లు మంత్రి తెలిపారు. ఈ కేంద్రాల్లో స్నేహపూర్వక వాతావరణంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారని చెప్పారు. మహిళా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన స్పష్టంచేశారు. భరోసా కేంద్రాలు లేని జిల్లాలో త్వరలో ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కేంద్రంలో ఆవరణలో మొక్కలను నాటి నీళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షిషా, డీఐజీ రెమా రాజేశ్వరీ, ఎస్పీ బాలస్వామి, భరోసా ఇన్‌చార్జి రాజరత్నం పాల్గొన్నారు.



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఎమ్మెల్యే రోహిత్‌రావు, కలెక్టర్ రాజర్షిషా

నేడు దేశవ్యాప్త బంద్

● వామపక్ష ఐక్య కార్మిక సంఘాల పిలుపు
● పోరాటానికి విద్యార్థి సంఘాల మద్దతు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 15: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా, రైతు వ్యవసాయ కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నేడు దేశవ్యాప్త సమ్మెను, గ్రామీణ భారత్ బంద్‌ను నిర్వహించనున్నారు. 15 రోజుల నుంచి దేశవ్యాప్త కార్మిక సమ్మె గ్రామీణ భారత్ బంద్ జయప్రదం కోసం వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలను చేపట్టారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజావ్యతిరేక బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు శ్రామిక ప్రజలను సమాయత్తం చేయాలన్నారు. నేడు జరగబోయే దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని ఆయా కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.

కేంద్రంలో బీజేపీ మతోన్మాద పాలన సాగిస్తోంది: సీపీఎం

● మల్లారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి

దేశంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక వర్గాలను విస్మరించి, విద్యార్థి రంగాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మకానికి పెడుతూ మతోన్మాద పాలన సాగిస్తోంది. భవిష్యత్తులో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడానికి అనేక పోరాటాలను నిర్వహించే అవకాశం ఉన్నది.

●సంగారెడ్డి రూరల్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బందులో అన్ని వర్గాల వారు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ. సాయిలు అన్నారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో గురువారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు యాదగిరి, కొండల్‌రెడ్డి, అశోక్, రాములు తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లోని గ్రామాల్లో సమ్మె నోటీసును అతికిస్తున్న సీఐటీయూ నాయకులు

●నారాయణఖేడ్: రైతులు, కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మాణిక్ కోరారు. గురువారం నారాయణఖేడ్‌లో సమ్మె పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పోరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘంనాయకులు బాబురావు, అరుణ్, పవన్‌రాజు, మాణిక్యంస్వామి పాల్గొన్నారు.

●గజ్వేల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం జరుగు సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య కార్మికులకు, ప్రజలకు, రైతాంగానికి పిలుపునిచ్చారు. గజ్వేల్ మండల పరిధిలోని కొడకండ్ల, ప్రజ్ఞాపూర్ గ్రామాల్లోని పలు పరిశ్రమల వద్ద సమ్మె నోటీసులు అతికించారు. అనంతరం కార్మికులతో సమావేశాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఉత్పత్తి చేసే శ్రామికులను నష్టం చేస్తూ కార్పొరేట్, పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలను మారుస్తూ పేద కార్మికులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, రాయితీలను రద్దు చేస్తున్నదన్నారు. నేడు జరిగే సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వారితో సీఐటీయూ నాయకులు వెంకటాచారి, కృష్ణ ఉన్నారు.



సంగారెడ్డిలోని సమావేశంలో మాట్లాడుతున్న సాయిలు

సమ్మెకు బీఎంఎస్ దూరం

●సంగారెడ్డి అర్బన్: రాజకీయ సమ్మెకు బీఎంఎస్ దూరంగా ఉంటుందని బీఎంఎస్ జిల్లా కార్యదర్శి మోహన్‌రెడ్డి తెలిపారు. సంగారెడ్డిలోని స్థానిక కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 16 న చేపట్టనున్న సమ్మె కార్మికులు, ప్రజల కోసం కాదని రాజకీయ స్వలాభం కోసం అవకాశ రాజకీయాల కోసం సమ్మె అని ఆరోపించారు. రాష్ట్ర పరిధిలోని కార్మికుల సమస్యను కేంద్రం ఎలా పరిష్కరిస్తుందని కార్మికులకు వివరించాల్సిన అవసరముందన్నారు. గత మూడు సంవత్సరాలకు ఒక సారి కనీస వేతనాలు సవరించాలన్న నిబంధన ఉంటే దానిని తుంగలో తొక్కి ఇప్పటి వరకు అమలు చేయలేదని, ఇలాంటివి ఈ రాజకీయ కార్మిక సంఘాలకు కనపడవా అని ప్రశ్నించారు. రాజకీయ కార్మిక సంఘాలు ప్రభుత్వాలకు వత్తాసు పలుకుతూ పబ్బం గడుపుతున్నాయని, రెక్కాడితే డొక్కాడని కార్మికులకు రాజకీయ రంగు పులుముతూ కులమతాలకు ప్రాంతీయ విభేదాలను సృష్టించి కార్మికులను విడదీయాలని చేస్తున్నారని, వీటిని తిప్పికొట్టాలని ఆయన హితవుపలికారు. ఈ సమావేశంలో బీఎంఎస్ నాయకులు, పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నంగునూరు, ఫిబ్రవరి 15: ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో దేశిరెడ్డి తెలిపారు. గురువారం మిట్టపల్లి సురభి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో నంగునూరు మండలం నర్మెట్ట కస్తూర్బా గాంధీ హాస్టల్‌లో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన 213 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో పద్మ, సురభి హాస్పిటల్ మార్కెటింగ్ ఇన్‌చార్జి చరణ్, డి.రాజు పాల్గొన్నారు.

'ప్రమోషన్లకు దూరం చేయడం దారుణం'

వెల్దుర్తి, ఫిబ్రవరి15: దశాబ్దాల అనుభవంతో విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి పాటు పడుతున్న ఉపాధ్యాయులకు టెట్ నిబంధనను చూపిస్తూ, సీనియర్ ఉపాధ్యాయులను ప్రమోషన్లకు దూరం చేయడం దారుణమని ఎస్‌జీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.. గత ప్రభుత్వ హయాంలో ఎన్‌సీఈఆర్‌టీ నిబంధనలు ఉన్నప్పటికీ ఒకసారి అరకొర పదోన్నతులు కూడా జరిగాయన్నారు. ప్రభుత్వ అధికారులు టెట్ అనివార్యమని ఎక్కడా ఎప్పుడు సూచించకపోవడం ఎవరి తప్పిదమన్నారు.

ఇంగ్లిష్ డ్రామా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొండపాక, ఫిబ్రవరి 15: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా వారు ఇందిరానగర్ పాఠశాలలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి ఇంగ్లిష్ డ్రామా పోటీల్లో కొండపాక మండలం దుద్దెడ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం పొందారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు. డ్రామా పోటీలకు విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఇంగ్లిష్ ఉపాధ్యాయులు కిరణ్మయి, చంద్రభాను, యాదగిరిలను అభినందించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి



దుర్గమ్మ(ఫైల్)

నర్సాపూర్, ఫిబ్రవరి 15: మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మరణించింది. ఈ సంఘటన నర్సాపూర్ సమీపంలో చోటుచేసుకున్నది. ఎస్ఐ పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం నర్సాపూర్ పట్టణంలోని సునీతారెడ్డి కాలనీలో నివసించే సంకు దుర్గమ్మ(45) అనే మహిళ భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నది. గురువారం ఉదయం నర్సాపూర్ పట్టణ సమీపంలోని హంసాఫర్ రెస్టారెంటు సమీపంలో మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారిపై రోడ్డుదాటుతున్న క్రమంలో మెదక్ నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఆమెను ఢీ కొనడంతో తలకు తీవ్ర గాయమై రక్తస్రావంతో అక్కడికక్కడే మరణించింది. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యవసాయ పొలంలో పడి యువరైతు మృతి

మిరుదొడ్డి, ఫిబ్రవరి15: వ్యవసాయ పొలం వద్ద ఒడ్డుపై నుంచి పొలంలో జారిపడి శ్రీకాంత్ (30)అనే యువరైతు మృతిచెందిన సంఘటన బుధవారం రాత్రి అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామంలో చోటుచేసుకున్నది. అక్బర్‌పేట-భూంపల్లి ఎస్ఐ భువనేశ్వర్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన బైండ్ల శ్రీకాంత్ బుధవారం రాత్రి వ్యవసాయపొలం వద్దకు వెళ్లాడు. అర్ధరాత్రి అయినా శ్రీకాంత్ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గ్రామంలో వెతికారు. అనంతరం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి చూడగా, పొలంలో బోర్లపడి మృతిచెంది ఉండడని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గాజులపల్లిలో..



రాంరెడ్డి(ఫైల్)

రాయపోల్, ఫిబ్రవరి 15: పొలంలో పడి ఓ రైతు మృతి చెందిన సంఘటన దౌల్తాబాద్ మండలం గాజులపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకున్నది. బాధిత కుటుంబసభ్యులు, ఎస్ఐ శ్రీరాం ప్రేమ్‌దీప్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గాజులపల్లికి చెందిన పోతుగంటి రాంరెడ్డి(45) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజూమాదిరిగానే బుధవారం ఉదయం గ్రామ శివారులో ఉన్న పొలం వద్దకు వెళ్ళాడు. ఆయన భార్య కూలీ పనికి వెళ్లింది. ఆమె సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లో భర్త కనిపించలేదు. దీంతో ఆమె భర్తకు ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. ఈ విషయాన్ని గ్రామస్థులకు చెప్పి పొలం వద్దకు వెళ్లి చూసిరమ్మని కోరింది. వారు పొలం వద్దకు వెళ్లి చూడగా రాంరెడ్డి పొలంలోని బురదలో బోర్లా పడిపోయి మృతి చెంది కనిపించాడు. వెంటనే వారు ఆయన కుటుంబసభ్యులకు ఫోన్ చేసి విషయాన్ని తెలిపారు. మృతుని భార్య సునిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్పార్క్ కుంగ్‌ఫూలో సత్తాచాటిన విద్యార్థులు



పతకాలు సాధించిన విద్యార్థులు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 15: డ్రాగన్ ఫైటర్ మార్షలార్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన 3వ ఇంటర్నేషనల్ ఓపెన్ టూ ఆల్ కరాటే కుంగ్‌ఫూ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సిద్దిపేట పట్టణానికి చెందిన ఎస్ఆర్ డీజీ పాఠశాల విద్యార్థులు స్పార్క్ కుంగ్‌ఫూలో పాల్గొని పతకాలు సాధించారు. కటాస్ విభాగంలో మొదటి బహుమతి శ్రీయాన్ష్, రెండో బహుమతి అద్వైత్, రాము, కృతిక్ సాయివర్మ, మూడో బహుమతి శరణ్య, హరిహరను, స్పారింగ్ విభాగంలో ప్రథమ బహుమతి అభినయ్ గెలుపొందారు. వీరిని పాఠశాల యాజమాన్యం, స్పార్క్ కుంగ్ ఫూ చీఫ్ కోచ్ రఘునందన్ రెడ్డి, శిక్షకులు జి.బాలు అభినందించారు.

టిప్పర్ బోల్తా పడి డ్రైవర్ మృతి

సిద్దిపేటరూరల్, ఫిబ్రవరి 15: కంకర టిప్పర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన సిద్దిపేట రూరల్ మండలంలోని ఇర్కోడ్ గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకున్నది. సిద్దిపేట రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట రామయంపేట రహదారి నిర్మాణంలో భాగంగా ఎస్ఎల్ఎంఐ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్న జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన భీమ్ శర్మ(40) శుక్రవారం కంకరను అన్లోడ్ చేస్తుండగా హైడ్రాలిక్ విరిగి టిప్పర్ బోల్తా పడింది. దాంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. తోటి డ్రైవర్ అనిల్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


సిద్దిపేటలోని గిరిజన కళాశాల బాలుర వసతి గృహంలో సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


మద్దూరు: సంత్ సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న పంచాయతీ సెక్రటరీ


గజ్వేల్‌లోని మల్లన్నసాగర్ ఆర్అండ్ఆర్ కాలనీలో నిర్వహించిన సేవాలాల్ జయంతిలో మాట్లాడుతున్న ఆర్డీవో బన్సీలాల్

ఘనంగా సేవాలాల్ మహరాజ్ జయంతి

గజ్వేల్/మద్దూరు/ములుగు/సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 15: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఆర్అండ్ఆర్ కాలనీలోని పల్లెపహాడ్‌తండా, ఏటిగడ్డ కిష్టాపూర్ తండాల్లో సంత్ సేవాలాల్ 285వ జయంతిని గజ్వేల్ ఆర్డీవో ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సేవాలాల్ చూపిన మార్గం అనుసరణీయమని, ఆయన బోధించిన మార్గం గొప్పదన్నారు. అనంతరం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో ర్యాలీ నిర్వహించారు. వారితో గజ్వేల్ జడ్పీటీసీ పంగ మల్లేశం, గజ్వేల్ ఏసీపీ బాలాజీ, తొగుట సీఐ లతీఫ్, గజ్వేల్ సీఐ బి.సైదా, తహసీల్దార్ బాల్‌రాజు పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు మోహన్నగారి రాజు, పార్టీ మండలాధ్యక్షుడు మల్లారెడ్డి, పల్లెపహాడ్ మాజీ ఉపసర్పంచ్ గుగులోత్ రమేశ్, జయరాం, అజ్మీర శంకర్, అజ్మీర రాజు, బంజారా సంఘం సభ్యులు ఉన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ పునరావాస కాలనీలో నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతిలో తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. మద్దూరు మండలం రేబర్తి గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ములుగు మండలం దాసరపల్లి గ్రామంలో సేవాలాల్ మహరాజ్ జయంతిని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా, మాజీ ఎంపీపీ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సిద్దిపేట పట్టణంలోని గిరిజన కళాశాల బాలుర వసతి గృహంలో నిర్వహించిన వేడుకల్లో సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, తహసీల్దార్ దిలీప్‌కుమార్‌నాయక్ సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి ఫిరంగి, పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


ములుగు మండలం దాసరపల్లితండాలో సేవాలాల్ మహరాజ్ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

కబ్జాకు గురైన భూమి స్వాధీనం

● ధాన్యం కొనుగోలు కేంద్రానికి కేటాయించాలని ప్రతిపాదన


గ్రామస్థులు స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూమి

కొండపాక, ఫిబ్రవరి 15: కొండపాక మండలం ఖమ్మంపల్లి గ్రామంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని ఎంపీటీసీ యాదగిరి ఆధ్వర్యంలో గ్రామస్థులు కాపాడి స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని 1061 సర్వే నంబర్‌లో గల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. ఈ విషయాన్ని తహసీల్దార్, ఆర్డీవోలకు గ్రామస్థులు సమాచారం అందించి భూమిని కాపాడాలని కోరారు. స్పందించిన అధికారులు కబ్జా నుంచి భూమిని కాపాడలేకపోయారు. చేసేదేమీ లేక గురువారం గ్రామస్థులు ఆ భూమిని స్వాధీనం చేసుకుని గ్రామ అవసరాల నిమిత్తం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయించాలని ప్రతిపాదించారు.

ఘనంగా 'మహంకాళి' వార్షికోత్సవం


దుబ్బాకలో మహంకాళీ ఆలయంలో పూజలు చేస్తున్న రఘునందన్‌రావు

దుబ్బాక, ఫిబ్రవరి 15: దుబ్బాక పట్టణంలోని మహంకాళీ ఆలయ 7వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవంలో దుబ్బాక మాజీ ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి, మున్నూరుకాపు సంఘం నాయకులు తదితరులున్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి: ఎంపీపీ


తిమ్మాపూర్ పీహెచ్‌సీలో మాట్లాడుతున్న ఎంపీపీ పుష్పలత

మిరుదొడ్డి, ఫిబ్రవరి 15: ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని దుబ్బాక ఎంపీపీ పుష్పలత అన్నారు. గురువారం దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామ పీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆస్పత్రికి వచ్చిన నిధులను ఆస్పత్రి అభివృద్ధి కోసమే ఖర్చు చేయాలన్నారు. ఈ సమావేశంలో వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమాచారం

మాటిండ్లలో మెగా వైద్య శిబిరం

నారాయణరావుపేట: నారాయణరావుపేట మండలం మాటిండ్ల గ్రామంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదేశాల మేరకు గురువారం ఆర్వీఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించినట్లు మాజీ సర్పంచ్ కొంగరి నారాయణ తెలిపారు. గ్రామంలో దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు, శస్త్రచికిత్స అవసరమైన వారికి పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల వితరణ

కొండపాక, ఫిబ్రవరి 15: కొండపాక మండలం దుద్దెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయురాలు కిరణ్మయి తన మనవడి అన్నప్రాసన సందర్భంగా గురువారం పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం ప్లేట్లు బహుకరించారు. అలాగే పదో తరగతి విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఉత్తమ ఫలితాల కోసం కష్టపడి చదవాలి'

కొండపాక, ఫిబ్రవరి 15: ఉత్తమ ఫలితాలు సాధించాలంటే కష్టపడి చదవాలని విశ్రాంత ఉప విద్యాధికారి పెద్దివైకుంఠం అన్నారు. ఇంటర్నేషనల్ అసోసియేషన్ అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్, ఎగ్జామ్ మెటీరియల్‌ను గురువారం అందజేశారు.

కంకర క్రషర్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకోండి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 15: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలో నిర్వహిస్తున్న అక్రమ క్రషర్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఏవో పరమేశంకు వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. సర్వే నంబర్ 116లో ప్రభుత్వం కేటాయించిన భూ పరిమితికి మించి తవ్వకాలు చేశారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్


అంతకపేటలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

అక్కన్నపేట, ఫిబ్రవరి 15: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అన్నారు. గురువారం అక్కన్నపేట మండలం అంతకపేట గ్రామంలో పారిశుధ్య వారోత్సవాల ముగింపు గ్రామసభకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇంటి పరిసరాలలో మురుగు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రత్యేకాధికారిని ఆదేశించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించేందుకే మొక్కలను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద తడి, పొడి చెత్త బుట్టలను ఉపయోగించి చెత్తను వేరువేరు బుట్టలో వేయాలని ప్రజలకు సూచించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ మహేష్, గ్రామ ప్రత్యేకాధికారి సంజీవ్‌కుమార్, ఎంపీడీవో జయరాం, ఎంపీటీసీ కంది రజితాశ్రీనివాస్‌రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ సర్వర్‌పాషా, ఎంపీవో కవికుమార్ పాల్గొన్నారు.

రూ.50 లక్షలతో డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్

● సిద్దిపేట గర్ల్స్ హైస్కూల్‌లో ఏర్పాటు
● త్వరలో ప్రారంభించనున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు


నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 15: సిద్దిపేట నియోజకవర్గంలోని గర్ల్స్ హైస్కూల్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు రూ.50 లక్షలతో డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. అలాగే ఇంగ్లిష్ మీడియం విద్యార్థుల డిజిటల్ బోధనకు 8 తరగతి గదుల్లో 8 స్ర్కీన్లు ఏర్పాటు చేశారు. దీంతో హైస్కూల్‌లో మొత్తం 21 కంప్యూటర్లతో ల్యాబ్ ఏర్పాటైంది. ప్రస్తుతం ఆ పనులు తుది దశకు చేరుకోగా.. త్వరలో ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాల గత ప్రభుత్వంలో హరీశ్‌రావు చొరవతో, నాట్కో వారి సౌజన్యంతో డిజిటల్ బోధన, కంప్యూటర్ ల్యాబ్‌తో కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు. కాగా పాఠశాలకు కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసిన హరీశ్‌రావుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు.

తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకుని చదవండి

● గజ్వేల్ ఏసీపీ ఏ.బాలాజీ


బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ బాలాజీ

గజ్వేల్, ఫిబ్రవరి 15: తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకుని చదవాలని గజ్వేల్ ఏసీపీ ఏ.బాలాజీ విద్యార్థినులకు సూచించారు. గజ్వేల్ పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోని జూనియర్ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలు, గుడ్, బ్యాడ్ టచ్‌లపై ఆయన అవగాహన కల్పించారు. మహిళల రక్షణకు సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా షీటీమ్స్ ప్రాముఖ్యత, సైబర్ నేరాలు, పోక్సో చట్టాలు, బాల్య వివాహాలు, ఈవ్‌టీజింగ్, సోషల్‌మీడియా ప్రభావాల గురించి వివరించారు. వారితో గజ్వేల్ సీఐ బి.సైదా, తొగుట సీఐ ఎస్‌కే లతీఫ్, మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, అధ్యాపకులు, గజ్వేల్ షీటీమ్స్ ఏఎస్ఐ శ్రీరాములు, కానిస్టేబుళ్లు శ్యామల, లావణ్య, మహేశ్, రాంచంద్రారెడ్డి తదితరులున్నారు.

మిరుదొడ్డిలో నిరుపయోగంగా యోగా షెడ్

● పట్టించుకోని అధికారులు ● వినియోగంలోకి తెస్తే గర్భిణులకు ఎంతో ప్రయోజనం



మిరుదొడ్డి పీహెచ్‌సీలో యునానీ ఆస్పత్రి నిధులతో నిర్మించిన యోగా షెడ్, స్టోర్‌రూంగా మారిన యోగా షెడ్

మిరుదొడ్డి, ఫిబ్రవరి 15: గత ప్రభుత్వం సాధారణ ప్రసవాలను ప్రోత్సహించేందుకు లక్షలు వెచ్చించి మిరుదొడ్డి మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆవరణలో యునానీ ఆస్పత్రికి సంబంధించిన యోగా షెడ్‌ను నిర్మించింది. ఇక్కడి వైద్య సిబ్బంది ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు సాధారణ ప్రసవాల కోసం యోగాను చేయించాలి. కానీ ఇక్కడ ఒక్కరికి కూడా యోగా చేయించిన దాఖలాలు లేవు. అంతేకాకుండా వైద్య సిబ్బంది ఆ యోగా షెడ్‌ను ఏంచక్కా స్టోర్ రూంగా మార్చేశారు. దీంతో సాధారణ ప్రసవాలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారనేది స్పష్టం కనిపిస్తున్నది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి యోగా షెడ్‌ను అందుబాటులోకి తేవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ ఏసీపీగా సుమన్‌కుమార్ బాధ్యతల స్వీకరణ


సీపీ అనురాధకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్, సిద్దిపేట ఏసీపీ మధు

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 15: సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీగా ఎం.సుమన్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన సీపీ డాక్టర్ బి.అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ సిద్దిపేట, గజ్వేల్ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ గురించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

సిద్దిపేట ఏసీపీగా మధు బాధ్యతల స్వీకరణ

సిద్దిపేట ఏసీపీగా జీ.మధు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీపీ డాక్టర్ అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. సీపీ మాట్లాడుతూ సిద్దిపేట డివిజన్ పరిధిలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.

తొగుట ఎంపీడీవోగా శ్రీనివాస్‌రెడ్డి


ములుగు ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకట శ్రీ రామకృష్ణశర్మ

తొగుట/ములుగు, ఫిబ్రవరి 15: తొగుట ఎంపీడీవోగా ఎ.శ్రీనివాస్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో శ్రీధర్ కరీంనగర్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. దాంతో మహబూబ్‌నగర్ జిల్లాలోని సీసీకుంట మండలంలో పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి తొగుటకు వచ్చారు. ములుగు ఎంపీడీవోగా పీవీఎస్ కృష్ణశర్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి మనోహరాబాద్ ఎంపీడీవోగా బదిలీ అయ్యారు. నల్లగొండ జిల్లా దేవరకొండ మండల ఎంపీడీవోగా పనిచేసిన కృష్ణశర్మ బదిలీపై ములుగుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను కేవీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొన్యాల బాల్‌రెడ్డి సన్మానించారు. ఎంపీవో నర్సింహారావు, రామచందర్, నర్సింహులు పాల్గొన్నారు.

రంగనాయకస్వామి ఆలయానికి రూ.లక్ష విరాళం


వినోద్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 15: ప్రజాసేవ చేయడమే తన లక్ష్యమని సామాజిక కార్యకర్త, యువకుడు జీడిపల్లి వినోద్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో రంగనాయకస్వామి ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళంగా అందజేశారు. అలాగే జగదేవ్‌పూర్‌లో ఇటీవల మృతి చెందిన కృష్ణమూర్తి, నూర్జాహ కుటుంబాలను పరామర్శించి, బియ్యం, నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు దాత వినోద్‌రెడ్డి, కిష్టారెడ్డికి శాలువా కప్పి సన్మానించారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సాయికుమార్, సల్మాన్, అప్సర్, శివాజీ యూత్, యువతరం యూత్, భగవత్ యూత్, మైనార్టీ యూత్, పెద్దమ్మ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

'అవినీతికి పాల్పడితే సహించేది లేదు'

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 15: సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో అవినీతికి పాల్పడితే సహించేది లేదని కమిషనర్ కే.ప్రసన్నరాణి స్పష్టం చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌గా కే.ప్రసన్నరాణి బాధ్యతలు చేపట్టి మాట్లాడారు. గతంలో హుజూరాబాద్ విధులు నిర్వహిస్తున్న సమయంలో హుజూరాబాద్ కలెక్టర్ సూచన మేరకు సిద్దిపేటను సందర్శించి జరిగిన అభివృద్ధిని అధ్యయనం చేసినట్లు తెలిపారు. అంతకుముందు కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, అదనపు కలెక్టర్లు గరిమా అగ్రవాల్, శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సులను కలిసి మొక్కలను అందజేశారు.

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా నర్సయ్య

గజ్వేల్, ఫిబ్రవరి 15: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్‌గా నర్సయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. రెండేళ్లుగా ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన విద్యాధర్ బదిలీపై జీహెచ్‌ఎంసీకి వెళ్లగా జోగులాంబ-గద్వాల జిల్లా అలంపూర్ మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న గోల్కొండ నర్సయ్య గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు.

చేర్యాల మున్సిపల్ కమిషనర్‌గా రమేష్

చేర్యాల, ఫిబ్రవరి 15: చేర్యాల మున్సిపల్ కమిషనర్‌గా రమేష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన కమిషనర్ రాజేంద్రకుమార్ నిజామాబాద్ కార్పొరేషన్‌కు బదిలీపై వెళ్లగా, మంచిర్యాల జిల్లా నస్పూర్ మున్సిపల్‌లో కమిషనర్‌గా పనిచేస్తున్న రమేష్ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దు


నారాయణరావుపేట: గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మారెడ్డి

నారాయణరావుపేట, ఫిబ్రవరి 15: గ్రామీణ ప్రాంత యువతకు మంచి భవిష్యత్ ఉన్నదని, మత్తు పదార్థాలకు బానిస కావొద్దని తహసీల్దార్ లక్ష్మారెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం నారాయణరావుపేట మండలంలోని ఆయా గ్రామాల్లో సాంఘీక దురాచారాలపై గ్రామసభలు నిర్వహించారు. గ్రామాల్లో విచ్చలవిడిగా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు వాడుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు సభల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం గ్రామపంచాయతీలో పనిచేసే కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీరాములు, ఎంపీవో శ్రీనివాస్, ఏవో వెంకట రమణి, అధికారులు పాల్గొన్నారు.

సాంఘీక దురాచారాలపై అవగాహన

మద్దూరు, ఫిబ్రవరి 15: మద్దూరు మండల కేంద్రంలో ప్రత్యేకాధికారి ఎస్.రామ్మోహన్ ఆధ్వర్యంలో సాంఘీక దురాచారాలపై గ్రామస్థులకు గురువారం అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలు, అంటరానితనం, మద్యపానం, ధూమపానం వంటి వాటికి వ్యతిరేకంగా పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ బొప్పె కనకమ్మ, ఏఎన్ఎం జ్యోతి, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కల్వకుంట్ల కుటుంబం లక్షల కోట్లు దోచుకున్నది

● కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 15: కాళేశ్వరం పేరుతో కల్వకుంట్ల కుటుంబం లక్షల కోట్లు దోచుకున్నదని కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ ఆరోపించారు. గురువారం సిద్దిపేట పట్టణంలో అత్తుఇమామ్ మాట్లాడుతూ పదేళ్లలో మీరు చేసిన పాపాలను కాంగ్రెస్ ప్రభుత్వం చక్కదిద్దుతున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో తెలంగాణ అభివృద్ధి చెందడంతో పాటు అన్నివర్గాలకు సమన్యాయం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గయాజుద్దీన్, రశాద్, శ్రీకర్, దరిపల్లి అజయ్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలి


బెజ్జంకిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

బెజ్జంకి, ఫిబ్రవరి 15: మండలంలోని పోతారం గ్రామ శివారులో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని మండలంలోని నర్సింహులపల్లి గ్రామస్థులు గురువారం తహసీల్దార్ ఎర్రోళ్ల శ్యాంకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ పోతారం గ్రామ శివారులో నిర్మిస్తున్న ఫ్యాక్టరీతో భవిష్యత్తులో కాలుష్యం ఏర్పడడంతో పాటు భూములు భూసారం కోల్పోయి అవకాశం ఉన్నదని తహసీల్దార్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింహులపల్లి గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.

కాళేశ్వరం బాధ్యులు జైలుకెళ్లడం ఖాయం

● డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజుయాదవ్

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 15: కాళేశ్వరం పేరిట దోచుకున్న మాజీ సీఎం కేసీఆర్ జైలుకెళ్లడం ఖాయమని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజుయాదవ్ అన్నారు. గురువారం సిద్దిపేట పట్టణంలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కుంగిన మేడిగడ్డ బ్యారేజీని మరమ్మతు చేసి రైతులకు నీరందిస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మీసం మహేందర్, సందబోయిన పరశురాములు, బత్తిని గణేష్, కొరిమి రాజు, మీసం రాజు, ఉడుత నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణన తీర్మానం పట్ల హర్షం


సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

హుస్నాబాద్, ఫిబ్రవరి 15: అసెంబ్లీలో బీసీ కులగణన తీర్మానం ప్రవేశపెట్టడం పట్ల గురువారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, బీసీ సంక్షేమ సంఘం నాయకులు అయిలేష్ యాదవ్, మేకల వీరన్నయాదవ్, పెరుమాండ్ల నర్సాగౌడ్, కోహెడ కొంరయ్య, మైదంశెట్టి వీరన్న, దుబాల శ్రీనివాస్, కుమారస్వామి, ప్రసాద్, భగవాన్ సింగ, ఆవుల వెంకటయ్య, బాలరాజుచారి పాల్గొన్నారు.

అలిరాజపేటలో గ్రామసభ

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 15: జగదేవ్‌పూర్ మండలంలోని అలిరాజపేటలో గ్రామ ప్రత్యేకాధికారి సునీతారెడ్డి ఆధ్వర్యంలో గురువారం గ్రామసభను నిర్వహించారు. ఈ సమావేశంలో పారిశుధ్యం, తాగునీరు, వీధిదీపాల నిర్వహణ, ఉపాధిహామీ పనులతో పాటు పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన కార్మికులను స్పెషలాఫీసర్ సునీతారెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రమ్య రవి, కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.